

రాజారావు పందెం వేశాడు తన కొలీగ్స్ అయిన రామారావు, అప్పారావు, భక్తవత్సలంతో. వాళ్ళందరూ కూడా రాజారావులా గుమస్తా గిరి వెలగబెట్టే వాళ్ళే. రాజారావు, అతని కొలీగ్స్‌తో పాటు ఇంకో వ్యక్తి కూడా వారితో సమానమైన హోదాయే వెలగబెడుతూ ఉంది.

ఆ వ్యక్తి మగ కాదు ఆడ. పేరు మేధ.

మేధ మరీ అంత అందంగా, నాజూగ్గా లేకపోయినా చూడ్డానికి మాత్రం అందంగానే ఉంటుంది అని చెప్పాలి. మేధ ఒక ప్రత్యేక తరహా వ్యక్తి. అవసరం వస్తే తప్ప ఎవరితో కలవదు. మాట్లాడదు. ఎవరైన తమంతట తామై పలుకరిస్తే పలుకుతుంది.

మేధలో ఇంకో ప్రత్యేక గుణముంది. సత్యహరిశ్చంద్రుడికి న్యాయానా తమ్ముళ్ళయిన రాజారావు, అప్పారావు, భక్తవత్సలం అవసరం కొద్దీ ఎన్ని మాయ మాటలు చెప్పి అప్పు అడిగినా ఇవ్వదు సరికదా, "ఎవరు చెయ్యమన్నారు అనవసరమైన ఖర్చు?" అంటూ వారి పై అధికారిలా మెత్తగా చీవాట్లు పెడుతుంది.

ఎంతగా ఆలోచించినా ఆ సత్య హరిశ్చంద్రులకు ఆమె మనఃప్రవృత్తి అర్థం కాలేదు. అందరు కలిసి ఆమెకు 'పిసినిగొట్టు' అని నామకరణం చేశారు.

మేధ అవివాహిత. చిన్నతనాన్నే తల్లిదండ్రులను పొగొట్టుకుంది. అత్త, మామే పెంచి పెద్ద చేశారు. చదివించి విద్యాబుద్ధులు నేర్పించారు. మేధ తాను చదివిన చదువుతో, ప్రతిభతో ఎలాంటి రికమెండేషన్లు లేకుండానే ఉద్యోగిని అయ్యింది.

రాజారావు తన కొలీగ్స్‌తో వేసుకున్న పందెం ఏమంటే. "ఎలాగయిన సరే ఓ అయిదొందలు మేధ దగ్గర్నుంచి అప్పుగా తీసుకు వస్తాను" అని.

"నీచేత కాదు." ముక్త కంఠంతో పలికారు కొలీగ్స్.

"అవుతుంది." పట్టుదలగా అన్నారాడు రాజారావు.

మాట పందెం వరకు పెరిగింది. పందెం నిర్ణయం జరిగింది.

రాజారావు మేధ దగ్గర్నుంచి అయిదొందలు అప్పుగా తెస్తే, ఆ అప్పు మొత్తాన్ని వీరు చెల్లించాలి. ఒకవేళ తీసుకు రాలేకపోయాడో - తాను వీరికి అయిదొంద లివ్వాలి. ఇది పందెం.

* * * * * *

రాజారావు ఆ రోజు రాత్రంతా వేసుకున్న ప్లాన్ ప్రకారం మర్నాడుదయం మేధ ఉంటున్న ఇంటికి వెళ్ళి తన పథకంలో భాగంగా దుఃఖం వ్యక్తం చేస్తూ "మేధ గారూ! తెల్లవారుజామున టెలిగ్రాం వచ్చింది - మా అమ్మకు సీరియస్‌గా ఉందని. ఫన్టు ఇంకా పది రోజులుంది. వెళ్ళడానికి జేబులో ఓ రూపాయి కూడా లేదు. దయచేసి మీ రెలాగైనా సరే ఓ అయిదొందలు అప్పుగా ఇస్తే వెళ్ళొచ్చి ఫన్టు తారీఖున మీ డబ్బు పువ్వులో పెట్టి ఇస్తాను. కావాలంటే నూటి పది చొప్పున వడ్డీ కూడా తీసుకోండి!" నిజంగానే కన్నీరు కార్చాడు రాజారావు - ఉద్యోగంలో చేరక ముందు కాలేజి చదువప్పుడు వేసిన నాట కానుభవం వల్ల.

మేధ ఆలోచనలో పడింది.

"ప్లీజ్! ఆలోచించకండి! ఇంకో అర గంటలో బస్సుంది. ఆ బస్సు మిస్సయితే తిరిగి రేపటి వరకు బస్సు లేదు."

"ఏ ఊరు వెళ్ళాలి?" రాజారావు వంక నిశితంగా చూస్తూ అడిగింది మేధ.

"ఇచ్ఛాపురం."

"ఎక్కడుందా ఊరు?"

"బంగాళాఖాతానికి దగ్గర్లో"

మేధ ఇంకేమి ఆలోచించకుండా పక్కనే ఉన్న బీరువాలో నుంచి ఓ అయిదు వందలు తీసి రాజరావు చేతికిస్తూ అడిగింది.

"మరెప్పుడిస్తారు?"

"ఫన్టుకు." చప్పున జవాబిచ్చి మేధ అందించిన అయిదొందలు ఆత్రంగా షర్టు జేబులో కుక్కుకున్నాడు రాజారావు.

"చాలా థాంక్సండి! మీ మేలు ఈ జన్మలో మరవ లేను. సమయానికి డబ్బిచ్చి నన్ను గట్టెక్కించారు." మేధ వంక కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ అన్నాడు. అతని మనసు ఆనందం పట్టలేక కోతిలా గెంతుతూ ఉంది.

మేధ చిన్నగా నవ్వి చెప్పింది.

"చేసిన మేలు మరిచినా ఫర్వాలేదు. కాని ఇచ్చిన అప్పు విషయం మాత్రం మరిచి పోకండి, చాలు.

"అమ్మమ్మ ఎంతమాట, ఎంత మాట మీ మేలు అంత తొందరగా మరిచి పోగలనా? జీవితాంతం గుర్తుంటుంది. వస్తానండి." శెలవు పుచ్చుకుని బయటికి వచ్చేశాడు రాజరావు. అతని పెదాల పైన గర్వంతో కూడిన చిరునగవు.

* * * * * *

పందెం గెలిచిన రాజారావు విజయగర్వంతో తన కొలీగ్స్ దగ్గరి కెళ్ళి "ఈ రాజారా వంటే ఎవరనుకొన్నారు?" అంటూ మీసం తిప్పబోయి ఆగిపోయాడు - తన మూతి మీద మీసం లేని విషయం గుర్తొచ్చి. బాంక్ నుంచి లక్షలు దోచి తెచ్చిన వాడిలా పోజు పెట్టాడు.

అతని పోజు చూసి కోలీగ్స్‌కు చిర్రెత్తు కొచ్చింది. అయినా తాము ఓడినందుకు కోపాన్ని దిగమింగుకుంటూ రాజారావును మనసులోనే కసితీరా తిట్టుకోంటూ పందెం డబ్బు ఇచ్చారు.

మర్నాడు ఉదయం రాజారావు హుషారుగా ఈలవేస్తూ ఆఫీసులోకి అడుగు పెట్టే సరికి మేధ ఎదురొచ్చి మంద స్మిత వదనంతో అడిగింది.

"బంగాళాఖాతానికి వెళ్ళ లేదా?" నవ్వుతూ అడిగినా అందులో వ్యంగ్యం ఉంది.

రాజారావు పచ్చి వెలక్కాయ గొంతులో అడ్డం పడ్డట్టయ్యింది. ముఖం పాలిపోయింది.

మేధ మళ్ళీ అడిగింది.

"బస్సు మిస్సయ్యిందా?!"

రాజారావు నాలుకపైన తడారి పోతూ ఉంది. ఏం చెప్పాలో తోచడం లేదు. అయినా ఏదో ఒకటి చెప్పాలి కాబట్టి రాని నవ్వును బలవంతంగా ముఖం పైన పులుముకుని చెప్పాడు.

"మేధాగారూ, సారీ! మా మిత్ర బృందం నన్ను ఫూల్‌ను చెయ్యడానికి - కావాలని అలా టెలిగ్రాం ఇచ్చారు. నిన్న ఏప్రిల్ ఫన్టు కదండీ - అందుకు! మీ దగ్గర్నుంచి డబ్బు తీసుకుని బయల్దేరుతూ ఉంటే అసలు విషయం చెప్పి ఫూల్‌ను చేశారు మీ డబ్బు తేవడం మరిచాను. రేపు ఇచ్చేస్తాను."

"అయితే ఈ రోజు ఏప్రిల్ సెకెండ్ కదూ?" అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది మేధా.

అంతే!

చప్పున నాలి క్కరుచుకున్నాడు రాజారావు. తాను చెప్పింది అబద్ధమని తెలిసి పోయినందుకు జుత్తు పీక్కొన్నాడు.

మేధ వారించి దూరంగా పక్కకు తీసుకెళ్ళి అంది-

"మీ పందెం విషయం నాకు ముందే తెలుసు."

"తెలుసా?" నిర్ఘాంత పోతూ అన్నాడు రాజారావు.

"అవును తెలుసు. మీ మాటలు దూరంగా పొంచి విన్నాను. అయినా ఏమీ తెలియనట్టూ మీ కాకమ్మ కథలు నమ్మినట్టుగా నటించి డబ్బిచ్చాను."

"ఎందుకు?" మేధ వంక విస్తుపోయి చూస్తు అడిగాడు రాజారావు.

"మీ పందెంలో సగ భాగం నాకూ వస్తుంది కనుక." నవ్వుతూ అంది మేధ.

"ఇది అన్యాయం -" అసలు విషయం అర్థమై పెద్దగా అరవబోయాడు రాజారావు.

"అరవ కండి. మీకే ప్రమాదం! మీ కొలీగ్స్ వచ్చి అడిగితే మీరే డబ్బిచ్చి తిరిగి తీసుకున్నారని చెబుతాను. అప్పుడు మీ అసలుకే ఎసరొస్తుంది. ఏమంటారు?"

జరగబోయేది తల్చుకొనేసరికి రాజారావుకు భయం పట్టు కొచ్చింది.

"అంత పని మాత్రం చెయ్యకండి! మీకు పుణ్యముంటుంది. మీ రడిగినట్టే సగం వాటా మీకు ఇస్తాను" అంటూ తన వంక కొలీగ్స్ రావడం చూసి మెల్లగా అక్కడ్నుంచి జారుకున్నాడు రాజారావు.